క్లుప్తంగా

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు నీటి సంరక్షణకు కృషి చేయాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువైన నీటిని పొదుపుగా వాడాల్సి ఉందన్నారు. కొంతమంది అవగాహన రాహిత్యంతో నీటిని వృథా చేస్తున్నారని, దీనివల్ల భావి తరాలు నీటి సమస్యలను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అధ్యాపకురాలు తహసీన్ నీటి సంరక్షణ పద్ధతులను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబూని అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేవీఎస్ ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రజాకార్ చిత్ర యూనిట్ సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రజాకార్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర విజయోత్సవంలో భాగంగా గవర్నర్ పేటలోని అప్సర థియేటర్ వద్దకు చిత్ర యూనిట్ చేరుకుంది. యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. దర్శకుడు యాట సత్యనారాయణ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన వాస్తవ ఘటనలను తెరకెక్కించినట్లు తెలిపారు. నిజాం హయాంలో జరిగిన అకృత్యాలను చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించామన్నారు. రజాకార్ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోందన్నారు. చిత్రాన్ని ప్రజలు బాగా ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలను ఆదరిస్తారనడానికి రజాకార్ చిత్రమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నటీనటులు ఇంద్రజ, రాజ్ అర్జున్, అనసూయ భరద్వాజ్, సహ నిర్మాత పోతిరెడ్డి అంజిరెడ్డి, పంపిణీ సంస్థ భువనేశ్వరి పిక్చర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు నిత్యావసరాలు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక, డాక్టర్ బి.వసంతకుమార్ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా నిరుపేద, అనాథ చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, రహీమా, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ మహానందీశ్వరస్వామికి అభిషేకం చేశారు. తొలుత నందీశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర స్వామివారి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దంపతులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: దంపతులపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన లావు మల్లేశ్వరి, ఆమె భర్త మాధవరావు ఆ కాలనీలో నివశిస్తున్నారు. అయితే మాధవరావు కాలనీ వాసులతో మాట్లాడుతున్న సమయంలో కాలనీ వాసి బొద్దులూరి వెంకటేశ్వరరావు వచ్చి అకారణంగా మాధవరావుతో గొడవపడి దౌర్జన్యం చేశాడు. ఇంతలో మాధవరావు భార్య మల్లేశ్వరి భర్తను తీసుకుని ఇంటికి వచ్చేసింది. వెంకటేశ్వరరావు వాకింగ్ చేసే సమయంలో మల్లేశ్వరిని ఉద్దేశిస్తూ నీ భర్త మాధవరావు ఎక్కడ ఉన్నాడని, అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నెరవేరిన న్యూఆర్ఆర్ పేట ప్రజల చిరకాల వాంఛ

- వైఎస్సార్‌సీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు
- 57వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవితో కలసి పర్యటన



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన 57వ డివిజన్ కార్పొరేటర్ దేవి తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరీపేట పేదల చిరకాల కోరిక అయిన ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి న్యూఆర్ ఆర్‌పేటలో శుక్రవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా న్యూఆర్ఆర్ పేట ప్రాంత ప్రజలు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని ప్రాథేయపడితే టీడీపీ పాలకులు ఎన్నికల సమయంలో మోసం చేసి డబ్బులు దండుకున్నారే తప్ప వారి గోడును పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి వారికి రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందించిందన్నారు. అంతే కాకుండా డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గత టీడీపీ పాలనలో ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో 57వ డివిజన్ వెనుకబడిపోయిందని, జగనన్న హయంలో ఈ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు నూతన రహదారులను నిర్మించామని చెప్పారు. సొంత ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల మంజూరు చేశామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడ్డాయని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు నరసింహారావు, నాయకులు మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు, బాల, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌతంరెడ్డిపై ఆరోపణలు నిరాధారం

బ్రాహ్మణ అభ్యుదయ సేవా సంఘం నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ అభ్యుదయ సేవా సంఘం నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన గండూరి ఉమామహేశ్వరరావు ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డిపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని బ్రాహ్మణ అభ్యుదయ సేవా సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు మందలపర్తి సత్య శ్రీహరి, దమ్మాలపాటి చంద్రశేఖర్, సీహెచ్ సాయిరామ్ వివరాలు వెల్లడించారు. సమాజంలో గౌరవప్రదంగా ప్రజా సేవలో ఉన్న గౌతంరెడ్డిపై గండూరి ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి గత ఏడేళ్లుగా తన స్థలం కబ్జా చేశారంటూ సోషల్ మీడియా, ఫేస్‌బుక్, పలు పత్రికల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పైగా ఒక పేద బ్రాహ్మణునికి అన్యాయం జరిగితే ఎందుకు స్పందించడం లేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా పలు బ్రాహ్మణ సంఘాలకు లేఖలు రాశారన్నారు. దీనిపై బ్రాహ్మణ సంఘాల విజ్ఞప్తి మేరకు విజయవాడ బ్రాహ్మణ అభ్యుదయ సేవా సంఘం నేతలు జరిగిన విషయంపై గౌతంరెడ్డిని కలసి వివరాలు సేకరించారన్నారు. 2016లో గండూరి ఉమా మహేశ్వరరావు అన్నయ్య గండూరి వెంకట విశ్వనాథ్‌కు వారసత్వంగా సర్వహక్కులతో సంక్రమించిన స్థలాన్ని భార్య, కుటుంబ సభ్యులు కలసి విక్రయించగా గౌతంరెడ్డి చట్టబద్ధంగా బ్యాంకు ద్వారా నగదు బదిలీ చేసి ఆ స్థలాన్ని కొనుగోలు చేశారన్నారు. అందుకు తగిన ఆధారాలు తాము సేకరించామని తెలిపారు. రాజకీయ ప్రలోభాలతో కావాలనే ఉమామహేశ్వరరావు నిరాధార ఆరోపణలు చేయడాన్ని బ్రాహ్మణ సంఘాలన్నీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. నిజంగా అన్యాయం జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలే తప్ప, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు హెచ్చరించారు.

బాబా మందిరం నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం



గౌతంరెడ్డికి విరాళం అందజేస్తున్న దాత సుబ్బారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానానికి శుక్రవారం దాత కరణం సుబ్బారావు రూ.50వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో బాబా మందిరాన్ని ఆంధ్రా షిర్డీగా తీర్చిదిద్దామన్నారు. షిర్డీలో మాదిరిగా అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దాత కరణం సుబ్బారావు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలలో తానూ కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో విరాళం అందజేస్తున్నానన్నారు. మందిరంలో నిర్వహించే ఏ కార్యక్రమానికి అయినా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి ప్రసాదం, శేషవస్త్రంతో దాతను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, మందిర సభ్యులు పాల్గొన్నారు.

విలేజి కండ్రికలో శరవేగంగా డ్రైనేజి నిర్మాణం



విలేజి కండ్రికలో జరుగుతున్న డ్రైన్ల నిర్మాణం పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో డ్రైనేజీ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 64వ డివిజన్లో భాగమైన విలేజి కండ్రికలో మురుగునీరు మొత్తం వెళ్లే విధంగా విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.30లక్షలతో 260 మీటర్ల పొడవునా డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారు. గతంలో మురుగునీరు పోయేందుకు సరైన సదుపాయం లేక మార్గం మధ్యలోనే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లేది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విలేజి కండ్రిక ప్రజల విన్నపం మేరకు ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు వీఎంసీ నిధుల నుంచి రూ.30లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అంతేకాక గ్రామంలో రైతుభరోసా కేంద్రం, రామాలయం వద్ద, యాదవుల బజారు ప్రాంతాల్లో 200 మీటర్లు డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని ఇంజినీరింగ్ సహాయకుడు కలపాల నవీన్ తెలియచేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని నాని
- స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి పర్యటన
- పాతబస్తీలోని హలీమ్ స్టాల్స్ వద్ద సందడి
- పంజా సెంటర్‌లో దర్గాను దర్శించుకుని చాదర్ సమర్పణ



హలీమ్ రుచి చూస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం నగరంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని నాని అన్నారు. పాతబస్తీలోని పంజా సెంటర్‌లో ఏర్పాటు చేసిన హలీమ్ దుకాణాలను, ఆ ప్రాంతంలో పలువురు ముస్లిం ప్రముఖులను కేశినేని నాని, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి శుక్రవారం రాత్రి సందర్శించారు. పంజా సెంటర్‌లో ఉన్న లోటేబాబా దర్గాను దర్శించుకుని ఆసిఫ్‌తో కలిసి చాదర్ సమర్పించారు. స్థానిక పార్టీ నేత బాషికి చెందిన హలీమ్ దుకాణంలో పార్టీ నాయకులతో కలిసి హలీమ్‌ను రుచి చూశారు. పాతబస్తీలోని ముస్లిం నాయకులతో ముచ్చటించారు. అనంతరం స్థానికులను పలకరిస్తూ ముందుకు సాగారు. పలువురు దుకాణ దారులు, పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు ఆయా దుకాణాల్లో కొద్ది సేపు కూర్చుని సందడి చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వన్‌టౌన్ మత సామరస్యాన్ని చాటే విధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారీలకు అండగా నిలుస్తుందన్నారు. ఆసిఫ్‌తో కలిసి పాత బస్తీలో ముస్లింలను కలవటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పాతబస్తీ కులమతాలకు అతీతమైనది : ఆసిఫ్

పాతబస్తీ కులమతాలకు అతీతమైన ప్రాంతమని షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీలో అన్ని మతాలు, కులాల వారు చక్కని సోదరభావంతో జీవిస్తున్నారని చెప్పారు. రంజాన్ మాసంలో అందరూ ఇక్కడకు వచ్చి హలీమ్ రుచులు చూసి వెళ్తుంటారన్నారు. రంజాన్ మాసంలో ఈ ప్రాంతమంతా హైదరాబాద్‌ను తలపించే రీతిలో ఉంటుందన్నారు. రంజాన్ మాసం ప్రజలందరికీ మంచి చేయాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు అర్షద్, యలకల చలపతిరావు, నాయకులు అబ్దుల్ వహాబ్, సలీమ్, యూనస్, బాషి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తోటవారి వీధి ఫీడర్‌లో వార్షిక తనిఖీలు, మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో స్థానిక 58వ డివిజన్ నందమూరినగర్‌లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నందమూరినగర్, తోట వారి వీధి, వైఎస్సార్ రోడ్, సిద్ధార్థ వీధి, సాగి హనుమంతరావు వీధి, వినాయక కాలనీ, భారత మాత కాలనీ పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని ఆయన కోరారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో 11 కేవీ సుందరయ్యనగర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున న్యూ రాజీవ్‌నగర్‌లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎన్నికలపై ఫిర్యాదులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక వాట్సప్ నంబర్ (హెల్ప్‌లైన్) 99590 90025 (ఎలక్షన్స్ గ్రీవెన్స్ సెల్)ను మున్సిపల్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే ప్రజలు ఈ వాట్సప్ నంబరు ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది ఆ ఫిర్యాదును సంబంధిత ఎన్నికల అధికారులకు పంపి సత్వర పరిష్కారాన్ని అందిస్తారని తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ 99590 90025 ద్వారా ప్రజలు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను నిస్సంకోచంగా పంపవచ్చన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అస్వస్థత

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విలేజి కండ్రికకు చెందిన విద్యార్థిని బడుగు వర్షిణి ఆయాసంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురైంది. చీఫ్ సూపరింటెండెంట్ రవిప్రసాద్ వెంటనే సమీపంలోని విలేజి హెల్త్ క్లినిక్‌కు సమాచారం ఇచ్చారు. ఏఎన్ఎం లక్ష్మీ పరీక్ష కేంద్రానికి వచ్చి విద్యార్థినికి గ్యాస్ టాబ్లెట్‌ను వేశారు. అనంతరం గ్రామంలోని 108 కేంద్రం సిబ్బంది వచ్చి విద్యార్థిని వ్యానులో ఎక్కించి ప్రాథమిక వైద్యం అందించారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న ఆ విద్యార్థిని యథావిధిగా పరీక్ష రాసింది. అనంతరం నందిగామ, తిరువూరు డెప్యూటీ విద్యాశాఖాధికారి వెంకటయ్య పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. 212 మంది విద్యార్థులకు గాను 195 మంది పరీక్షకు హాజరయ్యారు.

దాడిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు బ్రహ్మం గారి మఠం ప్రాంతానికి చెందిన దుక్కా హరీష్(26) గురువారం రాత్రి కొండపైకి వెళుతుండగా, అదే సమయంలో దారిలో ఉన్న దాసిన జయకృష్ణ, పోతిన యుగంధర్ కనిపించారు. హరీష్ వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, వాటి గురించి అడిగారు. ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని హరీష్ చెప్పగా, కోపంతో హరీష్‌ను జయకృష్ణ గట్టిగా పట్టుకోగా యుగంధర్ తన చేతికి ఉన్న కడియంతో దాడి చేశాడు. దీంతో హరీష్‌కు ముక్కు మీద గాయం అయింది. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నర్రి శ్రీను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ పాపారావుకు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు నర్రి శ్రీను ఇంటి వద్ద తనిఖీ చేయగా వివిధ రకాల మద్యం సీసాలు 40 లభించాయి. వీటి విలువ సుమారు రూ.6,600 వరకు ఉంటుంది. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

ఎన్నికలలో కబ్జాదారులతో అప్రమత్తం

- వైఎస్సార్‌సీపీ పాలనలోనే సమగ్ర అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికలలో కబ్జాదారులు పోటీ చేస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్–3లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్ పాల్, లోటస్ ల్యాండ్ మార్క్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పట్టని కబ్జాదారుడు కొబ్బరి బొండాంకు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కబ్జాదారులకు, గూండాలకు టికెట్లు ఇచ్చిన ఘనుడు చంద్రబాబు అని అన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా ఎన్నికలలో జగనన్నను ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో నరేంద్రమోదీని తిట్టిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తిరిగి ఎందుకు కలిసి పోటీ చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక వారిద్దరూ కుతంత్రాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. లోటస్ ల్యాండ్‌మార్క్‌లో గత ప్రభుత్వ హయాంలో చినుకుపడితే మోకాలి లోతు వర్షపునీరు నిలిచేదని, యూజీడీ లీకేజీలతో అస్తవ్యస్తంగా ఉండేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, యూజీడీ పనులు పూర్తిచేశామని చెప్పారు. ఓపెన్ జిమ్, ఉద్యానవనం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో 32వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలు ప్రజలకు వివరించండి

- ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా
- 59వ డివిజన్ ఏఎంసీ ప్రధాన కార్యదర్శిగా సుభాని నియామకం



పఠాన్ సుభానికి నియామకపత్రం అందిస్తున్న నాగుల్ మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులందరూ తీసుకోవాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) 59వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పఠాన్ సుభానిని నియమించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి సుభానికి అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం కృషి చేయాలని, ప్రధానంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలిచేలా చూడాలన్నారు. ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్ అలీ, ఎండీ కాలేషా, మౌలాలి, మస్తాన్ షరీఫ్, మస్తాన్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు–అభివృద్ధికి చోటు

27వ డివిజన్‌లో కార్పొరేటర్ మల్లీశ్వరి ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాను గుర్తుకు ఓటు అభివృద్ధికి చోటు అని, ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి కోరారు. స్థానిక 27వ డివిజన్ పసుపులేటి వారి వీధిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, కురిటి శివ, కొండాయగుంట రాములతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేసిన మంచిని చూసి ఓటు వేయాలని కోరారు. నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నమ్మితే.. మునిగినట్టే..

- అధిష్టానం సీటు ఇస్తుందని ఆశించిన స్మిత
- ఒప్పందం నిలబెట్టుకుంటారని ఆశించి భంగపాటు
- చలసాని కుటుంబానికి మళ్లీ మొండిచెయ్యి
- ఈ ఎన్నికల్లోనూ బోడెకు సీటు
- బెదిరింపులు, ఎన్ఆర్ఐల సపోర్టుతోనే దక్కిందంటూ చర్చ

కంకిపాడు: కుక్క తోక పట్టి గోదారి ఈదటం.. ఒప్పందం ప్రకారం టీడీపీ అధిష్టానం సీటు ఇస్తుందని నమ్మకం పెట్టుకోవడం.. రెండూ ఒకటేనని మరో మారు రుజువైందని స్మిత వర్గం మండిపడుతోంది. పార్టీని నమ్మితే నట్టేట ముని గినట్టేనని అధిష్టానం నిరూపించుకుందంటున్నా రు. కష్టపడితేనో, నమ్ముకుని ఉంటేనో సీటు రాదని, డబ్బు సంచుల రాజకీయమే పెనమలూరులో చెల్లుతుందని తేల్చిందని వాపోతున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా బోడె ప్రసాద్‌ను ఖరారు చేయడంతో టీడీపీ అధిష్టానం డబ్బు రాజకీయాలు, నమ్మకద్రోహంపై పార్టీ వర్గాల్లో బాహాటంగానే విస్తృత చర్చ సాగుతోంది.

చలసాని కుటుంబానికి మళ్లీ మొండి చెయ్యి..

పెనమలూరు నియోజకవర్గ టీడీపీలో చలసాని వెంకటేశ్వరరావు(పండు)ది ప్రత్యేకస్థానం. 2009లో పెనమలూరు నుంచి పోటీచేసి కేవలం 177 ఓట్లతో ఓటమి పాలయ్యారు. టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతుండగానే దారుణహత్యకు గురయ్యారు. దీంతో ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చింది. తొలుత పండు సతీమణి పద్మావతికి 2014 ఎన్నికల్లో సీటు ఇస్తామని చెప్పి అనివార్య కారణాల వల్ల ఇవ్వలేకపోతున్నామని అధిష్టానం చెప్పింది. మరలా ఈ దఫా పండు కుమార్తె దేవినేని స్మిత గతంలో జరిగిన ఒప్పందాలతో సీటు తమకే వస్తుందని నమ్మి నియోజకవర్గంలో ప్రతి గడప తిరుగుతూ పార్టీ కార్యక్రమాలు ప్రచారం చేశారు. సీటుపై గట్టి నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఈ దఫా కూడా వాళ్లకు రిక్తహస్తమే మిగిలింది. ఒప్పందాలను తుంగలో తొక్కి అధిష్టానం చేతులెత్తేసింది. న్యాయం జరుగుతుందని ఆశిస్తే నిరాశే మిగలడంతో భవిష్యత్తు కార్యాచరణకు పండు వర్గం సమాయత్తం అవుతోంది.

బెదిరింపులు, ఎన్ఆర్ఐల సపోర్టే కారణమా..?

నిన్నటివరకూ బోడె ప్రసాద్‌కు సీటు లేదని చెప్పిన అధిష్టానం చివరికి సీటు ఖరారు చేసింది. అధిష్టానం అన్యాయం చేసిందని, ప్రజలే న్యాయం చెప్పాలంటూ బోడె ప్రచారం చేశారు. రెండు రోజుల క్రితం మాట మార్చి, సీటు తనదేననే నమ్మకం వ్యక్తం చేశారు. దీని వెనుక డబ్బు మూటల రాజకీయం పని చేసిందనే వ్యాఖ్యలు బాహాటంగా వినిపిస్తున్నాయి. చంద్రబాబు, చినబాబుతో భేటి అయిన కొందరు ఎన్ఆర్ఐలు పెనమలూరు సీటు బోడెకు ఇవ్వాలని ఎన్నికల వ్యయం బాధ్యత తమదంటూ ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో గెలుపొందిన నేపథ్యంలో ప్రయోజనం పొందిన కొందరు నేతలు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు కూడా డబ్బు సంచులు సిద్ధం చేసి అధిష్టానం, ఎన్ఆర్ఐల వద్దకు చేర్చుతున్నారని బాహాటంగా చర్చ జరుగుతోంది. స్వతంత్రంగా పోటీ చేస్తానని బెదిరింపులు చేసినా పట్టించుకోకుండా చేసేది లేక అధిష్టానం 'ఖర్చు' దృష్టిలో పెట్టుకుని ఎన్ఆర్ఐలకు వత్తాసు పలికినట్లు తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. దొంగ పరీక్ష, ఇసుక, మట్టి అడ్డగోలుగా అమ్ముకున్నా, సెక్స్ రాకెట్, కాల్ మనీ కేసులు వంటివి ఎన్ని ఆరోపణలు ఉన్నా పట్టించుకోకుండా అధిష్టానం సీటు కేటాయించిందంటే అవే అర్హతలేమో? వర్గాలను కలుపుకొని వెళ్లలేకపోవడం కూడా అర్హతే అనుకుంటా? అధిష్టానం సీటు ఇవ్వడానికివే కారణాలేమో? అంటూ బోడె వ్యతిరేక వర్గాలు గుసగుసలాడుతున్నాయి.